
కొత్తపల్లి మండలంలోని నాగులమల్యాలలో ఓట్లు అభ్యర్థిస్తున్న మంత్రి గంగుల కమలాకర్


కొత్తపల్లి మండలంలోని నాగులమల్యాలలో పెద్దమ్మ తల్లికి ఫలాలు సమర్పిస్తున్న మంత్రి గంగుల


కరీంనగర్‌లోని రాంనగర్‌లో మహిళలను ఓటు అభ్యర్థిస్తున్న మంత్రి గంగుల

# గంగులకు నీరా'జనం'


కరీంనగర్‌లోని రాంనగర్‌లో తనకు బహూకరించిన గదతో మంత్రి గంగుల కమలాకర్

- **ఘన స్వాగతం పలికిన పల్లెలు, డివిజన్లు**

కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో మంత్రి గంగుల కమలాకర్‌కు జనం నీరాజనం పడుతున్నారు. తన ఎన్నికల ప్రచారంలో భాగంగా మొదటి రోజు కొత్తపల్లి మండలంలోని నాగులమల్యాల, కొండాపూర్, ఖాజీపూర్, ఐలవోనిపల్లి గ్రామాల్లో ఉదయం ప్రచారం నిర్వహించగా మహిళలు, ప్రజలు మంత్రికి ఘనస్వాగతం పలికారు. కార్యక్రమం గంట ఆలస్యమైనా మంత్రి రాక కోసం ప్రజలు వేచి ఉండడం గమనార్హం. డప్పు చప్పుళ్లు, పటాకల మోతతో స్వాగతం పలుకుగా మహిళలు మంగళహారతులతో తిలకం దిద్ది అభిమానాన్ని చాటుకున్నారు. మధ్యాహ్నం కరీంనగర్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో పట్టణ వ్యాపార, వర్తక సంఘం ప్రతినిధులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించగా పెద్ద సంఖ్యలో వ్యాపారులు, వర్తకులు సమావేశానికి హాజరయ్యారు. అలాగే సాయంత్రం నగరంలోని 14, 15, 16 డివిజన్లలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఇక్కడ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని మంగళహారతులు, పూల వర్షంతో స్వాగతం పలికారు. 14వ డివిజన్‌లో రాంనగర్‌లోని ఓ వీధిని అభివృద్ధి చేసినందుకు ఆ వీధి ప్రజలు ప్రత్యేకంగా మంత్రికి కృతజ్ఞతలు తెలపడంతోపాటు తమ ఓటు వేసి గెలిపిస్తామని హామీ ఇచ్చారు. అలాగే 15, 16 డివిజన్లలోనూ రాత్రి సమయంలో ప్రజలు వేచి ఉండి మంత్రికి స్వాగతం పలికారు.

**- కార్పొరేషన్, నవంబర్ 3**


కరీంనగర్‌లోని రాంనగర్‌లో మంత్రి గంగులకు పూలమాల వేస్తున్న చిన్నారులు


కరీంనగర్‌లోని రాంనగర్‌లో మంత్రి గంగులతో సెల్ఫీ తీసుకుంటున్న చిన్నారులు


కరీంనగర్‌లోని రాంనగర్‌లో జరిగిన సభకు తరలివచ్చిన ప్రజలు


కరీంనగర్‌లోని రాంనగర్‌లో మంత్రి గంగులకు డప్పు చప్పళ్లతో స్వాగతం పలుకుతున్న మహిళలు

# ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

- **నామినేషన్లకు సర్వం సిద్ధం**
- **జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి**
- **ఎస్పీ అఖిల్ మహాజన్**

కలెక్టరేట్, నవంబర్ 3: రాజన్నసిరిసిల్ల జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలను స్వేచ్ఛాయుత, ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించనున్నామని, ఇందుకు ప్రజలు, రాజకీయ పార్టీలు, మీడియా ప్రతినిధులు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. శుక్రవారం ఎన్నికల సంఘం ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ జారీతో వేములవాడ, సిరిసిల్ల నియోజకవర్గ కేంద్రాల్లో నామినేషన్‌ల స్వీకరణ ప్రారంభమైన నేపథ్యంలో ఎస్పీ అఖిల్‌మహాజన్‌తో కలిసి కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, జిల్లా పౌరసంబంధాల అధికారి మామిండ్ల దశరథంతో కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 3 నుంచి 10 వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరిస్తారన్నారు. 13న నామినేషన్ల స్క్రూటినీ, 15వ తేదీ వరకు నామినేషన్లు ఉపసంహరించుకునేందుకు అవకాశం కల్పిస్తారని చెప్పారు. అనంతరం పోటీలో ఉండే అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారన్నారు. ఈ నెల 30న పోలింగ్,. డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు చేపట్టి విజేతలను ప్రకటిస్తారని వెల్లడించారు. నామినేషన్ల స్వీకరణకు సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గ కేంద్రాల్లో జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసిందన్నారు. రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో నామినేషన్ ఫెసిలిటేషన్ సెంటర్, నామినేషన్‌ను పత్రాలు అందించే కౌంటర్లు, సెక్యూరిటీ డిపాజిట్ కౌంటర్లు, కంట్రోల్‌రూమ్, హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసిందన్నారు. ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు వారి నామినేషన్ పత్రాలను ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో సమర్పించాల్సి ఉంటుందన్నారు. సువిధ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నప్పటికీ అప్లికేషన్ సక్సెస్ అయిన తర్వాత వచ్చే పత్రాలపై అభ్యర్థి స్వయంగా సంతకం చేసి కాపీలను రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో సమర్పించాల్సి ఉంటుందని సూచించారు. నామినేషన్ దాఖలు చేయడానికి ఒక రోజు ముందే అభ్యర్థి తన పేరున ఎన్నికల ఖర్చు కోసం కొత్తగా బ్యాంకు ఖాతాను ప్రారంభించి వివరాలను ఆర్‌వో కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. జాతీయ, రాష్ట్ర పార్టీలకు చెందిన అభ్యర్థులు ఒక ప్రతిపాదకుడిని, ఇండిపెండెంట్లు, రిజిస్టర్ పార్టీలకు చెందిన అభ్యర్థులు పది మంది ప్రతిపాదకుల సంతకాలను సమర్పించాల్సి ఉంటుందన్నారు. ప్రతిపాదకులు సంబంధిత నియోజకవర్గానికి చెందిన ఓటర్లయి ఉండాలని చెప్పారు. ప్రతిపాదకులు నిరక్షరాస్యులైన పక్షంలో ఆర్‌వో సమక్షంలోనే వేలిము ద్ర వేయాల్సి ఉంటుందన్నారు. రిజర్వ్‌డ్ నియోజకవర్గాలకు చెందిన అభ్యర్థులు నామినేషన్‌తోపా టు కులధ్రువీకరణ పత్రాలను ఇవ్వాల్సి ఉంటుందన్నారు.


మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీఅఖిల్‌మహాజన్

## పటిష్ట బందోబస్తు: ఎస్పీ

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మద్యం, నగదు, ప్రలోభపరిచే వస్తువులు సరఫరా కాకుండా జిల్లా సరిహద్దుల్లో 7 చెక్‌పోస్టులు, 5 డైనమిక్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ అఖిల్‌మహాజన్ తెలిపారు. ఈ నెల 3 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో సిరిసిల్ల, వేములవాడ నామినేషన్ల కేంద్రాల వద్ద 100 మంది సిబ్బందితో భద్రతా ఏర్పాట్లు చేశామని చెప్పారు. రెండు బీఎస్‌ఎఫ్ కంపెనీల 200 మంది సాయుధ బలగాలు రాగా త్వరలో మరో 4 కంపెనీల సాయుధ బలగాలు రానున్నాయని తెలిపారు.

## కేంద్రాల్లో వసతులు కల్పించాలి

జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పోలింగ్ కేంద్రాల్లో కల్పించాల్సిన కనీస వసతులపై సమీక్ష నిర్వహించి మాట్లాడారు. సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లోని 547 పోలింగ్ కేంద్రాలను సెక్టోరియల్ అధికారులు క్షేత్ర స్థాయిలో సందర్శించి వసతులపై నివేదిక సమర్పించారన్నారు. 198 పోలింగ్ కేంద్రాల్లో వసతులు సక్రమంగా లేవని తెలిపారన్నారు. 198 పోలింగ్ కేంద్రాల్లో 157 పోలింగ్ కేంద్రాల వసతులను మెరుగుపర్చామని వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ గౌతంరెడ్డి, డీపీవో రవీందర్, డీఆర్డీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కార్యకర్తలకు అండగా బీఆర్‌ఎస్


అంజయ్యగౌడ్ కుటుంబానికి చెక్కు అందిస్తున్న సెస్ చైర్మన్ చిక్కాల

సిరిసిల్ల రూరల్, నవంబర్ 3: బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు అన్నారు. శుక్రవారం తంగళ్లపల్లి మండలం నర్సింహులపల్లిలో ఇటీవల ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై నుంచి పడి మృతి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త, గీతకార్మికుడు అంజయ్య గౌడ్ కుటుంబానికి పార్టీ బీమా చెక్కు రూ.2లక్షలు అందించారు. ఇక్కడ బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, ఎంపీపీ పడిగెల మానస, ఏఎంసీ చైర్‌పర్సన్ పూసపల్లి సరస్వతి, సర్పంచ్ ఆనందరావు , ఎంపీటీసీ బైరినేని రాము, బీఆర్‌ఎస్ గ్రామాధ్యక్షుడు కనకరాజుగౌడ్, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు వలికొండ వేణుగోపాల్‌రావు, సర్పంచులు కస్తూరి తిరుపతి రెడ్డి, అవినాశ్‌రెడ్డి, ఎంపీటీసీ కోడి అంతయ్య, పడిగెల రాజు, పూర్మాని రామలింగారెడ్డి, మోహన్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ షాగ దేవేందర్, మల్లయ్య, ఏనుగు రాజేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు